
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 35.0 : కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY

3



నాగర్‌కర్నూల్

జిల్లా వార్తలు

గురువారం 7 మార్చి 2024



సీఎంను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

సీఎం సభకు హాజరైన ప్రజలు





మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి; చిత్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే జీఎంఆర్



నృత్యం చేస్తున్న కళాకారులు



సీఎం సభకు వచ్చి అల్పాహారం తింటున్న ప్రజలు

పాలమూరులో పచ్చని.. పంటలు పండాలి

- ఉమ్మడి జిల్లాలో ప్రతీ ఎకరాకు సాగునీరు అందిస్తాం
- విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ
- చిన్నారెడ్డి ఆధ్వర్యంలో పనుల గుర్తింపు కోసం వ్యవస్థ
- చివరి రక్తం బొట్టు వరకు ఉమ్మడి జిల్లా కోసం పని చేస్తా..
- మీ బిడ్డను నేను.. జిల్లాను ఆదర్శంగా చేసే బాధ్యత నాదే..
- బీఆర్ఎస్, బీజేపీ పాలమూరుకు జాతీయ హోదా ఇవ్వలే..
- అందుకు డీకే అరుణ, జితేందర్‌రెడ్డి సమాధానం చెప్పి ఓట్లడగాలి
- పాలమూరు ప్రజాదీవెన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్, మార్చి6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'పాలమూరులో పచ్చని పంటలు పండాలి. ప్రతీ ఎకరాకు సాగునీరు అందించే బాధ్యత నాదే. పాలమూరు బిడ్డలు విద్య వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఇక లేదు. ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి ఆధ్వర్యంలో పనుల గుర్తింపు, వాటి అమలు కోసం ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తాను. పాలమూరును ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాను. నేను మీ బిడ్డను. నేనుండగా మీకు భయమెందుకు. నన్ను గుండెల్లో పెట్టుకుని చూసుకున్నరు. నేను కూడా చివరి రక్తం బొట్టు వరకు పాలమూరు శ్రేయస్సు కోసం పని చేస్తాను' అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ ప్రజాదీవెన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇప్పటికే మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా చల్లా వంశీచంద్‌రెడ్డిని ఖరారు చేసిన ఆయన.. బుధవారం సభలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా మన్నె జీవన్‌రెడ్డి పేరును ప్రకటించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ స్వతంత్ర్యం వచ్చిన తర్వాత పాలమూరు బిడ్డ బూరుగుల రామకృష్ణారావు హైదరాబాద్‌కు మొదటి ముఖ్యమంత్రి అయితే.. ఇప్పుడు నల్లమల రైతు బిడ్డను ముఖ్యమంత్రిని అయ్యానని తెలిపారు. కరీంనగర్‌లో మాట ఇచ్చినట్టుగా సోనియాగాంధీ తెలంగాణను ఇస్తే.. 2014 నుంచి పదేళ్లు దుష్టుడు, దుర్మార్గుడు పట్టి పీడించారని విమర్శించారు. నల్లమల్ల బిడ్డను నన్ను పాలమూరు ప్రజలు గుండెల్లో పెట్టుకుని చూసుకున్నారన్నారు. ఏ దారీ తెలియని నాడు మిడ్జిల్ నుంచి స్వతంత్రంగా జడ్పీటీసీ సభ్యుడిగా పోటీ చేస్తే గెలిపించారని చెప్పారు. 2007లో నిలబడితే గెలవబోవని ఎంతమంది చెప్పినా.. ఎవరో ఒకరు ధైర్యం చేయకపోతే ఎలా అని ముందడుగు వేసి, ఎమ్మెల్సీగా పోటీ చేసి, అందరి ఆశీర్వాదంతో గెలిచానన్నారు. 2009లో కొడంగల్ టికెట్ ఇస్తే 14 రోజుల్లో ఏడు వేల మెజారిటీతో గెలిపించారని తెలిపారు. 2014లో మరోసారి, 2023లో ఇంకోసారి గెలిపించారని వివరించారు. ఇప్పుడు మోదీ, కేడీ, బిల్లా, రంగాలకు నిలబడి, కలబడి కొట్లాడుతున్నానంటే పాలమూరు ప్రజలు ఇచ్చిన ధైర్యమేనని అన్నారు. 3650 రోజులు పాలన చేసిన మోదీ, కేడీ పాలమూరు- రంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వలేదని, కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేయలేదని అన్నారు. కరీంనగర్ నుంచి చావు తప్పి కన్ను లొట్టబోయి వస్తే ఆదరించామని చెప్పారు. ఆర్డీఎస్ కోసం పాదయాత్ర చేశానని చెప్పే కేసీఆర్.. నీళ్లు రావడం కోసం కుర్చీ వేసుకుని పనులు చేయించకుండా ఫామ్‌హౌజ్‌లో మందేసుకుని బొక్కబోర్ల పడుకున్నారని విమర్శించారు. పాలమూరు జిల్లా బిడ్డను తానని, భయం చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. పాలమూరును ఆదర్శంగా తీర్చిదిద్దే బాధ్యత తనదేనని అన్నారు. ఎమ్మెల్యేలకు వచ్చిన మెజారిటీ కంటే ఎంపీకి ఎక్కువ మెజారిటీ రావాలని తెలిపారు. శాసనమండలి సభ్యుడిగా పోటీలో ఉంటున్న జీవన్‌రెడ్డిని గెలిపించాలని, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్ల హక్కుల కోసం జీవన్‌రెడ్డి పని చేస్తారని అన్నారు. పెండింగ్ బిల్లులు రావడంలో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు.



సభలో అభివాదం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తే అంతు చూస్తరు

పాలమూరు బిడ్డ నడుపుతున్న ప్రభుత్వాన్ని పడగొడదామని చూస్తే ఒక్కొక్కరు నిప్పు కణికలై, మానవబాంబులై అంతుచూస్తారని రేవంత్‌రెడ్డి అన్నారు. పాలమూరు బిడ్డను చూస్తే ఓర్వలేకపోతున్నారని, తాను చదువుకోలేదా? తాను ఉద్యమం చేయలేదా? తనకు అర్హత లేదా? తాను ఏ అన్యాయం చేశానని బేకార్ మాటలు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఆ బేకార్‌గాన్ని పాలమూరు నుంచి పంపిస్తేనే తెలంగాణ రావడం వల్ల ముఖ్యమంత్రి అయ్యాడని అన్నారు. పాలమూరు నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో 12 సీట్లు గెలిచామని, నల్గొండ కంటే ఒక సీటు ఎక్కువ గెలుస్తామని చెప్పిన మాట నిలబెట్టుకున్నానని చెప్పారు. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో కూడా అక్కడ రెండు సీట్లు, ఇక్కడ రెండు సీట్లు కాంగ్రెస్ గెలవాలని తెలిపారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ దొర వద్దకు పోయి పాలమూరు ఆత్మ గౌరవాన్ని తగ్గించారని అన్నారు. పాలమూరు నుంచే జనజాతర మొదలైందని, 14 సీట్లు గెలవాలని సూచించారు. నక్క వినయాలు చేసే వారు వస్తారని, నమ్మి మోసపోవద్దని కోరారు. నాగం జనార్దన్‌రెడ్డి పాలమూరు నుంచి ఎంపీగా పోటీ చేసినప్పుడు 2014లో ప్రచారానికి వచ్చిన మోదీ పాలమూరు- రంగారెడ్డికి జాతీయ హోదా ఇస్తానని ప్రకటించారని, కానీ ఇప్పటివరకు ఇవ్వలేదని అన్నారు. దానికి సమాధానం చెప్పేంత వరకు ఓట్లడిగే నైతిక అర్హత డీకే అరుణ, జితేందర్‌రెడ్డిలకు లేదన్నారు. జిల్లాలో కార్యకర్తలు కష్టపడి పని చేస్తేనే పార్టీ అధికారంలోకి వచ్చిందని, వారి ఆధ్వర్యంలోనే ఇందిరమ్మ కమిటీలు వేసి. పథకాలు అమలు చేస్తామని చెప్పారు.

బీఆర్ఎస్ విశృంఖల అవినీతి: మంత్రి జూపల్లి



మహబూబ్‌నగర్: పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ పాలకులు, ఎమ్మెల్యేలు విశృంఖల అవినీతికి పాల్పడ్డారని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రజలను ఓటు అడిగే హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి పథకంలో ఒక మోటారు ద్వారా నీళ్లు ఎత్తిపోసి, జాతికి అంకితం చేసినట్లు గొప్పగా చెప్పుకున్నారని, ఇంకా రూ.లక్ష కోట్లు వెచ్చించినా ప్రాజెక్టు పూర్తికాదని దుయ్యబట్టారు. జిల్లా బిడ్డ రేవంత్ ఆధ్వర్యంలో పాలమూరు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని ప్రజల్లో పూర్తి విశ్వాసం కలుగుతుందన్నారు.

సంగంబండ పగులబోతుంది: వంశీచంద్ రెడ్డి

సంగంపల్లిలో బండను పగులకొడితే 20 వేల ఎకరాలకు నీరిచ్చే అవకాశం ఉందని, గత ప్రభుత్వం రూ.10 కోట్లు పరిహారం ఇస్తే ఈ పని పూర్తవనుండగా ఇవ్వలేదని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తే వెంటనే రూ.10 కోట్లు కేటాయించారని, తొందరలోనే సంగంబండ పగిలి.. 20 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. పాలమూరు-రంగారెడ్డిని కేసీఆర్ పదేళ్లు పండబెట్టారన్నారు. రోజు ఫుల్‌బాటిల్ ఎత్తిపోస్తున్నా, నీళ్ళు మాత్రం ఎత్తిపోయ లేదని దుయ్యబట్టారు.

కాంగ్రెస్ పునాదులను తాకలేరు: సంపత్‌కుమార్

కాంగ్రెస్ ముక్త్ భారత్ అన్నవాళ్లు.. ఇక్కడ రేవంత్ అనే పులి బతికే ఉందన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి, కాంగ్రెస్ పునాదులను కూడా తాకలేరని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. బీఆర్ఎస్ పని అయిపోయిందని, ఎన్ని జాకీలు పెట్టినా లేచే పరిస్థితి లేదన్నారు. బీజేపీ అక్కడక్కడ ఎగిరి పడుతుందని.. కులం, మతం పేరుతో చిచ్చు పెట్టడం తప్ప ఆ పార్టీకి ఏదీ చేతకాదన్నారు. మూడు నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో తమ తలరాతలు మారబోతున్నాయన్న విశ్వాసం ప్రజల్లో కలిగిందన్నారు.

దక్షిణ తెలంగాణ అభివృద్ధి: ఎమ్మెల్యే యెన్నం

ఇన్నాళ్లు పాలించిన నాయకులు ఉత్తర తెలంగాణనే అభివృద్ధి చేశారని, రేవంత్‌రెడ్డి పాలనలో ఇక దక్షిణ తెలంగాణ జిల్లాలు కూడా అభివృద్ధిలో పరుగులు తీయనున్నాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 70 ఏళ్ల పాలనలో ఇక్కడి బీడు పొలాలను, కరువును చూపి.. పదవులు పొందారే తప్ప ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదన్నారు. రేవంత్ మూడు నెలల్లోనే రూ.3 వేల కోట్లు నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టు కోసం మంజూరు చేశారన్నారు. మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, అనిరుధ్‌రెడ్డి, పర్ణికారెడ్డి, ఈర్లపల్లి శంకర్‌లు మాట్లాడుతూ కార్యకర్తల కష్టం, పోరాటం కారణంగా తాము ఎమ్మెల్యేగా మీ ముందు నిలబడ్డామని, మీ కష్టాన్ని తాము మరిచిపోమని చెప్పారు. ఆ కష్టానికి ప్రతిఫలం ఉంటుందన్నారు. ప్రజా పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. మూడు నెలల నుంచి భూ కబ్జాలు బంద్ అయ్యాయన్నారు. ఎంపీ ఎన్నికల్లో అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. రెండు ఎంపీ స్థానాలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, కూచకుళ్ల రాజేశ్ రెడ్డి, వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీలు కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, బల్మూరి వెంకట్, నాయకులు వేంనరేందర్‌రెడ్డి, అనిల్‌యాదవ్, డాక్టర్ మల్లురవి, మన్నె జీవన్‌రెడ్డి, ఒబేదుల్లా కొత్వాల్, శివసేనారెడ్డి, సరిత, ఆనంద్‌కుమార్‌గౌడ్, హర్షవర్ధన్‌రెడ్డి, వినోద్ కుమార్, శివకుమార్‌రెడ్డి, ఎన్‌పి వెంకటేశ్, ఎం సురేందర్ రెడ్డి, వసంత, యుగంధర్‌గౌడ్, సీజే బెనహర్, సిరాజ్ ఖాద్రి, లక్ష్మణ్‌యాదవ్ పాల్గొన్నారు.

రేపు భౌరాపూర్ జాతర

- నిబంధనలతో కూడిన అనుమతులు
- బీడీలు, సిగరెట్లు తాగడం నిషేధం
- డీఎఫ్‌వో రోహిత్ గోపిడి

మన్ననూర్, మార్చి 6: నల్లమలలోని భౌరాపూర్ భ్రమరాంబ, మల్లికార్జున స్వామి కల్యాణం సందర్భంగా చెంచుల జాతరకు ఈ నెల ఎనిమిదిన నిబంధనలతో కూడిన అటవీ అనుమతులు ఇస్తున్నట్లు డీఎఫ్‌వో రోహిత్ గోపిడి, మన్ననూరు, అమ్రాబాద్ రేంజ్ అధికారులు ఈశ్వర్, ఆదిత్య తెలిపారు. భౌరాపూర్ పులుల అభయారణ్య ప్రాంతంలో ఉండటంతో వన్యప్రాణులకు, అడవులకు ఎలాంటి హాని జరుగకుండా ప్రశాంత వాతావరణంలో చెంచులు జాతర జరుపుకోవాలని కోరారు. శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే షరతులతో కూడిన అటవీ ప్రవేశం ఉంటుందన్నారు. అడవిలో ప్లాస్టిక్ సీసాలు, కవర్లు పడేయడం, ఎండలు విపరీతంగా ఉన్నందున బీడీలు, సిగరెట్లు కాల్చడం నిషేధమన్నారు. అడవిలో ఎక్కడా ఆగకుండా నేరుగా భౌరాపూర్ వెళ్లి, తిరిగి రావాలన్నారు. అడవికి జరిగే నష్ట నివారణలో భాగంగా నాలుగు చక్రాల వాహనాలకు రూ.500 రుసుము చెల్లించాలని, ఆర్టీసీ బస్సులకు ఉచిత ప్రవేశం ఉంటుందని చెప్పారు.



భౌరాపూర్‌లోని భ్రమరాంబ, మల్లికార్జున స్వామి ఆలయం

ఉత్సాహంగా పొట్టేళ్ల పందేలు

- విజేతగా హైదరాబాద్ కిల్లర్ గ్రూప్

అయిజ, మార్చి 6 : పట్టణంలోని తిక్కవీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన పొట్టేళ్ల పందేలు ఉత్సాహంగా కొనసాగాయి. ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 30 పొట్టేళ్లు పాల్గొన్నాయి. వాటిలో హైదరాబాద్‌కు చెందిన కిల్లర్ గ్రూపు పొట్టేలు ప్రథమ స్థానంలో నిలిచింది. హైదరాబాద్ డెక్కన్ షీప్ ఫైటర్స్ ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లా గొందిపర్లకు చెందిన ప్రభాస్ పొట్టేలు మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నది. నాలుగవ స్థానాన్ని నంద్యాల రమేష్ పొట్టేలు దక్కించుకున్నది. పోటీలను తిలకించటానికి అయా రాష్ట్రాల నుంచి జనం తరలివచ్చారు.



తలపడుతున్న పొట్టేళ్లు

కొడుకును చంపిన తండ్రి



శివ(ఫైల్)

బిజినేపల్లి, మార్చి 6: తండ్రి తాగిన మైకంలో కొడుకును కత్తితో కడుపులో పొడిచి చంపిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో కలకలం సృష్టించింది. జిల్లాలోని బిజినేపల్లి మండలం నంది వడ్డెమాన్ గ్రామంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. జెట్టి నాగయ్య తాగిన మైకంలో తల్లి తిరుపతమ్మతో గొడవపడి, కొడుతుండగా వద్దని వారించేందుకు కొడుకు శివ(18)వెళ్లాడు. దాంతో తండ్రి శివ పొట్టలో కత్తితో పొడిచాడు. పేగులు బయటకు వచ్చి, రక్తపు మడుగులో పడిఉన్న శివను స్థానికులు వెంటనే నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి, అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. నాగయ్యను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.



వర్చువల్‌లో నారీ శక్తి వందన్ అభినందన్ కార్యక్రమం ప్రారంభోత్సవాన్ని తిలకిస్తున్న డీకే అరుణ, జితేందర్‌రెడ్డి, మహిళలు

మహిళలను ప్రోత్సహిస్తున్నది మోదీనే..

- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

మహబూబ్‌నగర్ (క్లాక్ టవర్)/జడ్చర్ల, మార్చి 6: మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నది, వారిని ఆర్థికంగా శక్తివంతంగా చేయాలన్నది దేశ ప్రధాన మంత్రి మోదీ సంకల్పమని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ కొనియాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మనమందరం సపోర్టుగా నిలిచి, బీజేపీని గెలిపించాలని ఆమె మహిళలకు పిలుపు నిచ్చారు. నారీ శక్తి వందన్ అభినందన్ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం పశ్చిమ బెంగాల్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ మహబూబ్‌నగర్ కార్యాలయంలో వర్చువల్‌లో డీకే అరుణ, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఏపీ జితేందర్‌రెడ్డి, మహిళలతో కలిసి వీక్షించారు. అనంతరం డీకే అరుణ మాట్లాడుతూ పేదరికం నుంచి వచ్చిన మోదీ ఎంతో కష్టపడి అంచలంచెలుగా ఎదిగారన్నారు. పేదల కష్టాలు తెలిసిన ఆయన పేద కుటుంబ కష్టాలు తీర్చేలా పాలన చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు ఆత్మ గౌరవంతో బతికేలా ప్రతీ ఇంటికి మరుగు దొడ్డి నిర్మించారన్నారు. కట్టెల పొయ్యి కష్టాలు తీర్చాలని ఉజ్వల గ్యాస్ పథకం కింద గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ముద్ర పథకం కింద డ్వాక్రా మహిళలకు రుణాలు ఇస్తున్నారన్నారు. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు తెచ్చింది బీజేపీయే అని చెప్పారు. జితేందర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం చేపట్టిన పథకాలు, కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి, ఉదయశ్రీ, జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ రెడ్డి, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రవీణ కుమార్ యాదవ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షుడు పద్మవేణి, రాధిక, రాష్ట్ర నాయకులు ఏపీ మిథున్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అంజయ్య, నాయకులు పాల్గొన్నారు.

కేంద్రం సహకారంతోనే రాష్ట్ర అభివృద్ధి

కేంద్ర ప్రభుత్వం సహకారం లేనిదే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మాజీ మంత్రి డీకే అరుణ అన్నారు. జడ్చర్ల పట్టణంలోని కెంచె లింగమణెమ్మ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన నారీ శక్తి కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి గడిచిన పదేళ్లలో వివిధ అభివృద్ధి పథకాల కింద కేంద్రం రూ.10 లక్షల కోట్లను వెచ్చించిందన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీని బడేభాయ్ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబోధించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ అంశంపై కొందరు రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదని హితువు పలికారు. కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుందని అన్నారు. గెలవాలన్న కుట్రలతో అడ్డగోలు ఆరోపణలు చేస్తోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం, మేడిగడ్డపై కేంద్రం విచారణ చేపట్టాలని, ఆధారాలు ఇస్తానన్న రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధి ఉంటే సీబీఐ విచారణకు కేంద్రాన్ని కోరాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు చిత్తరంజన్‌దాస్, బాలత్రిపురసుందరి, సాహితిరెడ్డి, కృష్ణాబాయి, చెవ్వలలిత, రేణువతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







శ్రీశైలానికి 252 ప్రత్యేక బస్సులు

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 6 : మహాశివరాత్రిని పురస్కరించుకొని శ్రీశైలం శివక్షేత్రానికి మహబూబ్‌నగర్ రీజియన్‌లోని తొమ్మిది డిపోల నుంచి 252 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు మహబూబ్‌నగర్ ఆర్ఎం వి.శ్రీదేవి తెలిపారు. ఈ బస్సులు బుధవారం నుంచి శుక్రవారం వరకు నడుస్తాయని చెప్పారు. బుధవారం 42 బస్సులు, గురువారం 49, శుక్రవారం 161 బస్సులు నడుపుతామని వివరించారు. బుధవారం అచ్చంపేట నుంచి 10 బస్సులు, మహబూబ్‌నగర్ నుంచి 12 బస్సులు నడిపిస్తామన్నారు. మిగతా డిపోల్లో ప్రయాణికుల రద్దీని బట్టి బస్సులు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈనెల ఏడో తేదీన కూడా అచ్చంపేట నుంచి 10 బస్సులు, మహబూబ్‌నగర్ నుంచి 14 బస్సులు నడిపిస్తామని తెలిపారు. మహా శివరాత్రి రోజు అచ్చంపేట, కల్వకుర్తి నుంచి 15 బస్సులు, కొల్లాపూర్, నారాయణపేట నుంచి 10, మహబూబ్‌నగర్ నుంచి 33, షాద్‌నగర్, వనపర్తి నుంచి 13 బస్సులు నడిపిస్తామని వివరించారు. అవసరం అనుకుంటే మరిన్ని బస్సులు నడిపిస్తామని తెలిపారు. భక్తులు ఆర్టీసీ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. ఈనెల తొమ్మిదో తేదీన తిరుగు ప్రయాణంలో శ్రీశైలం నుంచి 161 బస్సులు వివిధ డిపోలకు నడిపిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

దోమలపెంట, మార్చి 6 : తిరుపతికి వెళ్లి వస్తూ నంద్యాల నియోజకవర్గం ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల వద్ద హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం వటవర్లపల్లి గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు. ఈగలపెంట ఎస్సై ఖాద్రీ తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన సౌట అశోక్(22) టెంపరరీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సికింద్రాబాద్‌లోని వెంకటాపురం ప్రాంతానికి చెందిన రవీందర్, భార్య, కుమారుడు, కోడలుతో కలిసి తిరుపతి దర్శనానికి వారి కారులో డ్రైవర్‌గా అశోక్‌తో కలిసి వెళ్లారు. తిరుపతి దర్శనం చేసుకొని తిరిగి వస్తుండగా ముందు వెళ్తున్న లారీని వీరి కారు ఢీకొట్టింది. ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ పోలీసులు అక్కడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు అశోక్‌కు తల్లి పుష్పమ్మతో పాటు, అక్క, అన్న ఉన్నారు. అశోక్ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.











వాడిపోతున్న పండ్ల తోటలు!

నల్లగొండ జిల్లాలో బత్తాయి, నిమ్మతోటలకు నీటిగండం.. అడుగంటిన భూగర్భ జలాలు

- పంట నష్టం రూ.180 కోట్ల దాకా
- సర్కారు చొరవ చూపాలని రైతుల వినతి

నల్లగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ జిల్లాలో పండ్లతోటల రైతులకు నీటిగండం వెంటాడుతోంది. భూగర్భజలాల నీటిమట్టాలు రోజురోజుకీ పడిపోతుండటంతో వాటి ఆధారంగా సాగు చేసిన బత్తాయి, నిమ్మతోటలకు తీవ్ర నీటికొరత ఏర్పడింది. కనగల్లు మండలం చర్లగౌరారం, గుర్రంపోడు మండలం పోచంపల్లి సహా జిల్లావ్యాప్తంగా సుమారు 60వేల ఎకరాల్లో బత్తాయి, మరో 12 వేల ఎకరాల్లో వేసిన నిమ్మతోటలు నీరందక వాడిపోతున్నాయి. తోటలను కాపాడుకోవాలనే ఆశతో రైతులు లెక్కకుమిక్కిలిగా బోరుబావులు తవ్వుతున్న పరిస్థితి జిల్లా వ్యాప్తంగా ఏర్పడింది. నాన్ ఆయకట్టు ప్రాంతాలైన నల్లగొండ, దేవరకొండ డివిజన్లతో పాటు, మిర్యాలగూడ డివిజన్‌లోని మెట్ట ప్రాంతాల్లో ఈ కరువు పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో దాదాపు 300 నుంచి 500 అడుగుల లోతువరకు బోర్లు తవ్వినా, నీరు కనిపించకపోవడంతో రైతాంగం నైరాశ్యంలో మునిగింది. పండ్ల తోటలను సంరక్షించుకునేందుకు రైతులు ఒక్కొక్కరు 10, 20 వరకు బోర్లు వేస్తూ ఆర్థికంగా మరింత దెబ్బతింటున్న పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి కొనసాగితే జిల్లావ్యాప్తంగా బత్తాయి, నిమ్మ రైతులు సుమారు రూ.180 నుంచి రూ. 200 కోట్ల వరకు నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. చెట్లు కూడా ఎండిపోతే మరింత నష్టపోవాల్సి ఉంటుందని, 10, 15 ఏళ్ల పాటు చేసిన శ్రమంతా వృథా అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏఎమ్మార్పీ వరద కాల్వల ద్వారా వీలైనన్ని చెరువులను నీటితో నింపితే భూగర్భజలాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా పంట నష్టపోయినా.. తోటలైనా దక్కుతాయని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సాగర్‌లో నిల్వలు లేనందున ఎగువన ఉన్న ఆల్మట్టి నుంచి నీటిని విడుదల చేయిస్తే ఆదుకున్నట్లవుతుందని, ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.

పశువుల మేతగా వరి పొలం

కూసుమంచి: యాసంగిలో వరి సాగు చేయొద్దని అధికారులు సూచించినా చాలామంది రైతులు పాలేరు పాతకాల్వ ఆయకట్టులో వరిసాగు చేశారు. అయితే పంట చివరి దశకు వచ్చిన ప్రస్తుత సమయంలో నీరు అందకపోవడంతో వరిపొలాలు ఎండిపోతున్నాయి. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జక్కేపల్లి, పెరికశింగారంలో వరిపొలాలకు సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. పాలేరు నుంచి నీరు విడుదల చేయాలని రైతులు మొన్నటిదాకా ఆందోళనలు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో పాతకాల్వ పరిధిలో ఎండిపోతున్న వరి పొలాల్లో రైతులు తమ పశువులను మేపుతున్నారు.



నల్లగొండ జిల్లా చిన్నఅడిశర్లపల్లిలో బోరుబావి నీళ్లు తగ్గడంతో వచ్చే కొద్దినీటిని పైపుల ద్వారా బత్తాయి చెట్లకు పోస్తున్న రైతు కూరలింగయ్య

చెరువులు నింపే కార్యాచరణ చేపట్టాలి



నాకు ఆరెకరాల బత్తాయి తోట ఉంది. భూగర్భజలాలు అడుగంటడంతో గతంలో ఉన్న బోరుబావులు నీరు పోయడం లేదు. నీళ్లందక తోట వాడిపోతోంది. ఇటీవల మూడు బోర్లు వేయించాను. చివరి బోరు 500 ఫీట్లవరకు వేసినా చుక్కనీరు రాలేదు. తోట ఎండితే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం తక్షణమే ఏఎమ్మార్పీ ద్వారా చెరువులు నింపేందుకు చర్యలు తీసుకోవాలి.

- పోలేని యాదయ్య, బత్తాయి రైతు, పోచంపల్లి, నల్లగొండ

నీళ్లు లేక నిమ్మతోట ఎండుతోంది



నాకు రెండు ఎకరాల నిమ్మతోట ఉంది. మరో నాలుగెకరాల్లో వరి కూడా వేశాం. గతంలో నాలుగు బోర్లుంటే ఎండిపోయాయి. ఇటీవల మళ్లీ నాలుగు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. నిమ్మతోట ఎండిపోతే ఎకరాకు కనీసం లక్షవరకు నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొని మమ్మల్ని ఆదుకోవాలి.

- సత్తిరెడ్డి, నిమ్మరైతు, చర్లగౌరారం, నల్లగొండ జిల్లా

నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు


నేడు ప్రధాని శంకుస్థాపన

హైదరాబాద్/వికారాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూ.137.76 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్రంలో చేపట్టనున్న నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ గురువారం మధ్యాహ్నం శంకుస్థాపన చేయనున్నారు. ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం, భువనగిరి జిల్లాలోని భువనగిరి కోట, వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి కొండలు, హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద చేపట్టే వివిధ అభివృద్ధి పనులను మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారు. స్వదేశీ దర్శన్, ప్రసాద్ పథకాల కింద దేశ వ్యాప్తంగా 52 పర్యాటక కేంద్రాలను ఎంపిక చేసిన కేంద్రం దాదాపు రూ.1325.76 కోట్ల వ్యయంతో ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టనుంది. ఇందులో భాగంగా ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం అభివృద్ధికి, వసతుల కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.38.90 కోట్లు కేటాయించింది. అలాగే, భువనగిరి కోట ప్రాంతంలో విశ్రాంతి భవనాలు, పార్కులు, హరితవనాల అభివృద్ధికి, కోటపైకి చేరుకునేందుకు రోప్‌వే నిర్మాణానికి తొలి దశలో రూ.56.81 కోట్లు కేటాయించింది. హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ప్రాంతంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.4.05 కోట్లు కేటాయించారు. తెలంగాణ ఊటీగా ఖ్యాతి పొందిన అనంతగిరి కొండలు, అక్కడి అటవీ ప్రాంతాల్లో వసతుల కల్పనకు రూ.38 కోట్లు కేటాయించారు. ఆయా పనులు గురువారం ప్రారంభం కానున్నాయి. అనంతగిరి కొండలను ఎకో టూరిజం హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. ఇందులో భాగంగా మొత్తం రూ.98 కోట్లతో అభివృద్ధి పనులను నాలుగు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు.

తాగునీటికి కష్టమే!

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ తాగునీటి అవసరాలకే తరలించాలని మంత్రి పొన్నం తాజాగా అధికారులను ఆదేశించినా.. ఆ నీళ్లలో గరిష్ఠంగా ఏడు టీఎంసీల దాకానే వచ్చే అవకాశం ఉండటంతో పట్నంలో ఈ వేసవిలో తాగునీటికి కటకట తప్పదనే అంచనాలకు బలం చేకూరుతోంది. బుధవారం సచివాలయంలో జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు తదితర విభాగాల అధికారులతో బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ పరిధిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కృష్ణా, గోదావరి బ్యారేజీల్లో ఉన్న నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తదనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం ఎల్లంపల్లి నుంచి 10 టీఎంసీలు వినియోగించుకోవాలని సూచించారు. ఎల్లంపల్లి నీటిని గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేటకు ఇవ్వకుండా హైదరాబాద్‌కు తరలిస్తున్నారనే ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు. నీటి సరఫరా, రంజాన్‌లో ఏర్పాట్లు, వర్షాకాలంలో ముంపు ముప్పు నివారణ చర్యలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. 2017 అనంతరం ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, నగరంలో తాగునీటికి ఇబ్బందులు లేవని మంత్రికి అధికారులు వివరించారు. వేసవితో పాటు రంజాన్ మాసంలో అవసరాల కోసం నీటి ట్యాంకర్లు 24 గంటలు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఇందుకు ఆర్థిక ఇబ్బందులుంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పొన్నం చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు తాగునీరు, ఇతరత్రా వసతులకు సంబంధించిన చర్యలు చేపట్టాలన్నారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని వర్షాకాలంలో ముంపు ముప్పు, ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యాన్ హోల్‌లు తెరిచి ఉంటే ప్రమాదకరం అని, అలాంటి చోట్ల సిబ్బంది పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయం ముందు భారీగా వరద నీరు నిలుస్తోందని అధికారులు చెప్పడంతో ఆర్ అండ్ బీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారనికి చొరవ తీసుకుంటామని పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ రాక ముందే ప్రారంభించే పనులుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని చెప్పారు.



ఎల్లంపల్లి ప్రాజెక్టు (ఫైల్)

ఎల్లంపల్లి నీరొచ్చినా దాహ'మే'!

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు అడుగంటుతోంది. పదేళ్లుగా ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది నీటి నిల్వలు భారీగా పడిపోయాయి. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో కాళేశ్వరం నుంచి నీటి లభ్యత కూడా లేకుండాపోయింది. ప్రాజెక్టుకు తక్షణ నీటి సరఫరాకు అనుగుణంగా ఉండే కడెం ప్రాజెక్టులో కూడా నీటి నిల్వలు అడుగంటాయి. మార్చి 2వ తేదీ లెక్కల ప్రకారం 10.48 టీఎంసీల నీరే ఉంది. ఇక 7.66 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కడెంలో ప్రస్తుతం 3.88టీఎంసీల నీరే ఉంది. ఇందులో డెడ్ స్టోరేజీ కింద 2.8 టీఎంసీలను మినహాయిస్తే ప్రాజెక్టు నుంచి ఒక టీఎంసీ మాత్రమే ఎల్లంపల్లికి తీసుకునే అవకాశం ఉంది. పైగా ఎల్లంపల్లి ప్రాజెక్టులో నాలుగు టీఎంసీల కన్నా ఎక్కువ ఉంటేనే హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసేలా పంప్‌హౌస్‌ను ఏర్పాటు చేశారు. అంటే ఎల్లంపల్లికి కడెం నుంచి ఓ టీఎంసీ నీరు విడుదల చేసినా గరిష్ఠంగా ఏడు టీఎంసీలనే హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉంటుంది. ఈ నీళ్లు మార్చి, ఏప్రిల్ మాసాల్లో హైదరాబాద్‌కు తాగునీటి అవసరాలు తీరుతాయని.. మే, జూన్ నెలల్లో మాత్రం తాగునీటికి కటకట తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాగార్జున సాగర్‌లో కూడా 515 లెవల్ వరకు నీళ్లు ఉన్నాయి. ఈ నీళ్లు మరో 5 ఫీట్ల మేర పడిపోతే హైదరాబాద్‌కు నీటి సరఫరా తగ్గొచ్చని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి

శ్రీరాంసాగరే దిక్కు

ఎండాకాలంలో హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం శ్రీరాంసాగరే ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. శ్రీరాంసాగర్‌లో 40టీఎంల నీటి నిల్వలున్నాయి. ప్రధానంగా ఇక్కడి నీటిని సాగు అవసరాలకే వాడుతున్నారు. శ్రీరాంసాగర్ నుంచి ఎల్లంపల్లికి నీటిని విడుదల చేస్తే తాగునీటి గండం నుంచి గట్టెక్కొచ్చు. అయితే ఈ విషయంలో నీటిపారుదల శాఖ అధికారులు స్పందించకపోవడం హైదరాబాద్ వాటర్‌వర్క్స్ అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. సీఈలు, ఎస్ఈల స్థాయిల్లో చర్చకు పెట్టినా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో చలనం లేకపోవడం కలవరపెడుతోంది.

కాలుష్య నియంత్రణ బోర్డులో

అవినీతి అధికారులు

- మండిపడిన హైకోర్టు
- సుమోటోగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచన

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (టీపీసీబీ)లో అవినీతి అధికారులు ఉన్నారంటూ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పీసీబీని సంపూర్ణ ప్రక్షాళన చేసే దిశగా ఇలాంటి అధికారులపై సుమోటోగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది. రంగారెడ్డి జిల్లా గగన్‌పహాడ్‌లో ఉన్న ప్రోస్టర్స్ అనే కంపెనీకి జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ జారీచేసిన కంపెనీ మూసివేత నోటీసును హైకోర్టు కొట్టేసింది. వాటర్ (ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ పొల్యూషన్) యాక్ట్ - 1988 ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోరాదో వివరించాలని ఆ పీసీబీ అధికారి పిటిషనర్ కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీచేశారు. చట్టంలోని నిబంధన ప్రకారం ప్లాస్టిక్ వాషింగ్ యూనిట్‌కు అనుమతి అవసరం లేదంటూ ఆ కంపెనీ సమాధానం ఇచ్చింది. కంపెనీ ఇచ్చిన వివరణను పట్టించుకోకుండా, తమ నోటీసులకు ఎలాంటి సమాధానం ఇవ్వలేదని పేర్కొంటూ అధికారి క్లోజర్ ఆదేశాలు జారీచేశారు. మూసివేత ఆదేశాలను సవాల్ చేస్తూ కంపెనీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. 'రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాల్లో ఇదో బాధాకరమైన విషయం. పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోని అవినీతి అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. పీసీబీ వ్యవస్థను పారదర్శకంగా మార్చాలి. గత ఏడునెలలుగా మేం పీసీబీ పనితీరును గమనిస్తున్నాం. కొంత మంది అధికారులు షోకాజ్ నోటీసులు ఇస్తారు. మరి కొంత మంది అధికారులు వచ్చి ఎలాంటి సమాధానం రాలేదంటూ తుది ఆదేశాలు ఇస్తారు. సామర్థ్యం లేని అధికారులను మారుమూల ప్రాంతాలకు బదిలీ చేయాలి' అని వ్యాఖ్యానించింది. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా జారీచేసిన మూసివేత ఉత్తర్వులు చెల్లవని పేర్కొంటూ వాటిని కొట్టేసింది. ఈ పనిని వేరే అధికారికి అప్పగించి.. 15 రోజుల్లో తాజా ఆదేశాలు జారీచేయాలని స్పష్టం చేసింది. 15 రోజుల్లో తాజా ఆదేశాలు ఇవ్వకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని స్పష్టం చేసింది.

ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ రాజకీయం!

- కేటీఆర్‌కు కోదండరెడ్డి ప్రశ్న

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ పార్టీ రాజకీయం చేస్తోందని.. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అక్రమ లే అవుట్లు వేస్తుంటే నిద్రపోయారా అని కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి ప్రశ్నించారు. ఎల్ఆర్ఎస్‌పై ఇచ్చిన రెండు జీవోలూ గత ప్రభుత్వం ఇచ్చినవేనని, కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన ఆ జీవోల్లోనే ధరలూ నిర్ణయించారన్నారు. గాంధీ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోదండరెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు అమాయక ప్రజల నుంచి డబ్బులు లాక్కునే ప్రయత్నం చేసిన కేటీఆర్.. ఇప్పుడేమో ఉచితంగా రెగ్యులరైజ్ చేయాలంటూ చెబుతున్నారన్నారు. హౌసింగ్ బోర్డు ద్వారా పేదలకు ఇళ్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. కోకాపేటలో పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం భూమి ఇస్తే.. కేసీఆర్ వాటిని లాక్కుని బిల్డర్లకు ఇచ్చారన్నారు. ఔటర్ రింగ్ రోడ్డును ప్రైవేటు కంపెనీకి అప్పగించేశారన్నారు. జీవో 111 పరిధిలోని భూములనూ ఆక్రమించారన్నారు. వీటన్నిటిపైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

బీఆర్ఎస్ బలహీనపడింది

- పొత్తులతో అది స్పష్టం: నిరంజన్

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా బీఆర్ఎస్ పార్టీ ఎంత బలహీనపడిందో స్పష్టమైందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. బీఆర్ఎస్ నేతలు ఆ పార్టీని వీడి వెళుతుండడంతో ఉనికిని కాపాడుకునేందుకు కేసీఆర్ నానా తంటాలు పడుతున్నారన్నారు. నిబద్ధత గల అధికారిగా పేరున్న ప్రవీణ్‌కుమార్‌కూ ఇది ఒక చెరగని మచ్చ అన్నారు. దళితుడిని తెలంగాణకు తొలి సీఎంగా చేస్తానని చెప్పి మాట తప్పినందుకు కేసీఆర్ పంచన చేరారా.. అంటూ ప్రవీణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఏక్‌నాథ్ షిండేగా పేర్కొంటున్న కేటీఆర్.. హింసించే రాజు 23వ పులకేశి అంటూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కైలాష్ నేత ధ్వజమెత్తారు. బీఆర్ఎస్‌ను కేసీఆర్ హోల్‌సేల్‌గా బీజేపీకి అమ్మకానికి పెట్టారన్నారు. ప్రవీణ్‌కుమార్‌ని పెంచి పోషించింది బీఆర్ఎస్ పార్టీనేనని, అది ఇప్పుడు బట్టబయలైందని అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈమేరకు మాట్లాడారు.

గాంధీభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీభవన్‌లో బుధవారం మహిళాకాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుక జరిగింది. మహిళా కాంగ్రెస్ నేతలు భారీ కేక్‌ను కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకల్లో మంత్రి కొండా సురేఖ, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓటర్ల వివరాలు ఇవ్వండి

- ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్ల వారీగా ఇంటినంబర్లతో కూడిన మ్యాప్ (నజ్రీ నక్ష)లను మాజీ ఎంపీ, ఆ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి అందజేయాలని ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ గతేడాది జారీచేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) ప్రకారం నజ్రీ నక్ష అందజేయాల్సి ఉండగా అందుకు ఎన్నికల అధికారులు నిరాకరిస్తున్నారని పేర్కొంటూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్. రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో 2.40 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారని, హైదరాబాద్‌లో 1.65 లక్షల మంది వరకు ఉన్నారని ఆరోపించారు. ఎన్నికల అధికారులు ఇంటి నెంబర్లతో కూడిన నజ్రీ నక్షలను బయటపెట్టకపోవడం వల్ల ఓటర్ల జాబితాలో అక్రమాలకు అవకాశం ఏర్పడుతోందని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫు సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయి వాదనలు వినిపిస్తూ.. ఫొటోలతో కూడిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా, ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఏరియాను ప్రతిబింబించే నజ్రీ నక్షను ఆయా రాజకీయ పార్టీలకు ఎన్నికల అధికారులు అందజేస్తారని పేర్కొన్నారు. తగిన మొత్తంలో రుసుము చెల్లిస్తే పిటిషనర్‌కు నక్ష అందజేయడానికి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఖర్చులు స్వీకరించి పిటిషనర్ కోరిన విధంగా నజ్రీ నక్ష అందజేయాలని ఆదేశించింది.

సీడ్ కార్పొరేషన్‌లో సిత్రాలెన్నో!

(మొదటి పేజీ తరువాయి)

ఆర్భాటంగా ప్రకటించగా.. గడిచిన పదేళ్లలో విత్తనోత్పత్తి కాస్తా ఏటా నేలచూపులు చూస్తూ.. అథఃపాతాళానికి పడిపోయింది. విత్తనాల నాణ్యతను ధ్రువీకరించే 'సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ'లోనూ అన్నీ అవకతవకలే.! ఇక్కడ సిబ్బంది బయోమెట్రిక్ ఉండదు. ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అసలు విధుల్లోకే రారు. సంతకాలు చేయరు. తొమ్మిదేళ్లుగా జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ హెచ్‌వోడీగా, సీడ్ కార్పొరేషన్ ఎండీగా కె.కేశవులు పనిచేస్తున్నారు. ఈ తొమ్మిదేళ్లలో రికార్డు స్థాయిలో 28 విదేశీ పర్యటనలు చేశారు. ఏ ముఖ్యమంత్రి గానీ, మంత్రులు గానీ ఇన్ని విదేశీ పర్యటనలు చేయకపోవడం విశేషం. పైగా.. 2022 అక్టోబరులో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో కె.కేశవులు స్వస్థలమేది? అంటూ ఓ ప్రశ్న రావడం గమనార్హం!

గ్రో ఔట్ టెస్ట్ నిధులెక్కడ?

విత్తనాభివృద్ధి కోసం గ్రో ఔట్ టెస్ట్(జీవోటీ) ఫామ్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.50 లక్షలను మ్యాచింగ్ గ్రాంట్ కింద అందజేశాయి. రాజేంద్రనగర్‌లోని జయశంకర్ వర్సిటీ ప్రాంగణంలో ఈ ఫామ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. ఇప్పుడు అక్కడ పాడుబడ్డ ఓ గేటు, చెట్ల పొదలు, ముళ్ల కంపలు తప్ప.. అక్కడ ఫామ్ లేదు. అయితే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చిన రూ.కోటి నిధులు ఎక్కడ? అనేది ఇప్పుడు ప్రశ్నగా మారింది. ఒక్క విత్తన గింజను ఉత్పత్తిచేయకున్నా.. యూసీలు మాత్రం సమర్పించారు. తెలంగాణను 'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా చేస్తామంటూ గత ప్రభుత్వం చేసిన ప్రకటన ఆర్భాటాలకే పరిమితమైంది. లక్షల నిధులు కేటాయించినా.. విత్తనోత్పత్తి పెరగకపోగా.. సీడ్ కార్పొరేషన్‌లో పదేళ్లుగా నేలచూపులు చూస్తోంది. ఎగుమతులు క్షీణించాయి. 2014-15లో సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన విత్తనోత్పత్తి 3.18 లక్షల క్వింటాళ్లు కాగా.. 2021-21లో 1.56 లక్షల క్వింటాళ్లు, 2022-23లో 1.78 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. విత్తన పంపిణీ 2014-15లో 3.36 లక్షల క్వింటాళ్లుగా ఉండగా.. 2022-23లో అది 3.05 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీలో రిజిస్ట్రేషన్లు కూడా గణనీయంగా పడిపోయాయి. 2015-16తో పోలిస్తే.. 2022-23కల్లా ఈ రిజిస్ట్రేషన్లు 1.65 లక్షల మేర తగ్గిపోయాయి.

ఇస్టా కాంగ్రెస్‌కు ఇష్టారాజ్యంగా నిధులు

హైదరాబాద్‌లో 2019 జూన్ నెలలో 32వ ఇస్టా కాంగ్రెస్ సదస్సును నిర్వహించారు. 75 దేశాల నుంచి 451 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరైనట్లు ఇస్టా కాంగ్రెస్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించిన టీఎస్-ఎస్‌వోసీఏ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.కేశవులు అప్పట్లో వెల్లడించారు. ఈ సదస్సు నిర్వహణకు అప్పట్లో 'రైతుబంధు' నిధులను మళ్లించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. సుమారు రూ.10 కోట్ల నిధులను ఇస్టా కాంగ్రెస్ సదస్సుకు ఖర్చు చేశారు. ఇందులో పెద్దమొత్తంలో నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలున్నాయి. మూడు రోజులకు నోవాటెల్ హోటల్ హాలు, భోజనాలకే రూ.70 లక్షల ఖర్చు రాశారు. డెలిగేట్స్ గదులకు రూ.25 లక్షలు, స్టాల్స్ ఏర్పాటుకు రూ.43.12 లక్షలు, కార్నివాల్ ఏర్పాట్లకు రూ.20.37 లక్షలు, తాజ్ హోటల్స్‌లో ఫుడ్ అండ్ బెవరేజెస్‌కు రూ.26.34 లక్షలు, సాంస్కృతిక కార్యక్రమాలకు రూ.25.65 లక్షలు, ప్రచారానికి రూ.12 లక్షలు, హైటెక్స్‌లో స్టేజీ ఇతరత్రా ఏర్పాట్లకు రూ.20 లక్షలు, ఇస్టా వీడియో ఫిల్మ్‌లకు రూ.18 లక్షలు, ఎగ్జిబిటర్లు, అధికారుల ఫీజులకు రూ.52.75 లక్షలు, రైతుల సమావేశానికి రూ.56 లక్షలు, చిల్లర ఖర్చులకు రూ.15 లక్షలు వెచ్చించారు. చివరకు నోడల్ ఆఫీసర్ కేశవులు ఐ-ఫోన్ కోసం రూ.65 వేలను ఈ నిధుల్లోంచే ఖర్చుచేశారు. హైదరాబాద్‌లోని పలు స్టార్‌హోటళ్ల పేరుతో విచ్చలవిడిగా బిల్లులను సమర్పించారు. దీనిపై అప్పట్లో విమర్శలు వచ్చినా.. నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు.

ప్రైవేటు ఏజెన్సీలతోనే ఆడిటింగ్

తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ, విత్తన ధ్రువీకరణ సంస్థకు సంబంధించిన ఆడిట్‌ను ఏటా ప్రైవేటు ఏజెన్సీలతోనే చేయించారు. ఒక 2021-22లో మాత్రమే ఏజీ ఆడిట్ జరిగింది. ఆర్‌కేవీవై పథకంలో వరంగల్‌లో ఆఫీస్ బిల్డింగ్ పూర్తిగా నిర్మించకుండానే రూ.95 లక్షలకు యూసీలు సమర్పించినట్లు తెలుస్తోంది. మినీ బస్ కొనుగోలు, సబ్-మిషన్ ఆఫ్ సీడ్స్ అండ్ ప్లాంటింగ్ మెటీరియల్ నిధుల మళ్లింపు, వాహనాల నిర్వహణ, వ్యవసాయశాఖ కార్యదర్శి కార్యాలయంలో పనిచేసే టెక్నికల్ సిబ్బందికి వేతన చెల్లింపులు, ఈపీఎఫ్-ఈఎస్ఐ కాంట్రిబ్యూషన్, కాకాని కన్సల్టెన్సీకి చేసిన చెల్లింపులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సీడ్ టెస్టింగ్ ల్యాబ్ పేరుతో ఆర్‌కేవీవై నిధుల మళ్లింపులో జరిగిన అవకతవకలు ఏజీ ఆడిట్‌లో వెలుగుచూశాయి. మిగిలిన సంవత్సరాల్లో చిట్టిబాబు అండ్ కంపెనీ, సుబ్రమణ్యం అండ్ కంపెనీ అనే ఏజెన్సీలతో ఆడిట్ చేయించారు. అక్రమాలను కప్పి పుచ్చుకునేందుకే ప్రైవేటు ఏజెన్సీలతో ఆడిట్ చేయించినట్లు ఆరోపణలున్నాయి.

జీతం ఇక్కడ.. చేసేది ఆర్డర్లీ

సీడ్ సర్టిఫికేషన్‌లో ఉద్యోగంలో చేరిన ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది.. విధులకు హాజరవ్వడం లేదు. బయోమెట్రిక్ వేయటం లేదు. ఒకరేమో హైదరాబాద్ లంగర్‌హౌస్‌లో నివాసముంటున్న ఏపీ మాజీ సీఎస్ ఇంట్లో పనిచేస్తున్నారు. మరొకరు ఆ మాజీ ఐఏఎస్ ఇంటిపక్కనే ఉండే సీడ్ కార్పొరేషన్ ఎండీ ఇంట్లో ఊడిగం చేస్తున్నట్లు సమాచారం. ఈ ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏడాదికోసారి తెల్లకాగితాలపై సంతకాలు చేసి పంపుతున్నట్లు.. దాన్నే రెన్యూవల్ ఆఫ్ సర్వీసెస్‌గా అధికారులు రికార్డుల్లో పెడుతున్నట్లు తెలుస్తోంది.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

బిజినేపల్లి, మార్చి 6 : గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా ప్రణాళిక రూపొందించుకొని చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ కుమా ర్ దీపక్ అధికారులను ఆదేశించారు. మండలంలోని మంగనూర్ గ్రామంలో బుధవారం ఆకస్మికంగా పర్యటించి భగీరథ వాటర్ ట్యాంక్‌ను, మోటార్లను పరిశీలించి సంబంధిత శాఖ అధికారు లతో మాట్లాడారు. అలాగే పారిశుధ్య సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కాల నీలను శుభ్రంగా ఉంచాలన్నారు. నర్సరీల్లో పెంచుతున్న ప్రతీ మొక్కను బతికించి రాబోయే వానాకాలం వరకు లక్ష్యం మేరకు మొక్కలను సిద్ధం చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని వడ్డించాలని ఆదేశించారు. అలాగే విద్యార్థులను చదవడం, రాయడంలో ఉన్నతంగా తీర్చిదిద్దాలని హెచ్‌ఎం శ్రీనివాస్ రెడ్డికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో కతాలప్ప, పంచాయతీ కార్యదర్శి విమల, ఫీల్డ్ అసిస్టెంట్ కురుమూర్తి తదితరులున్నారు.

అతి తక్కువ ధరకు ఇసుక సరఫరా: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట, మార్చి 6: నియోజకవర్గ ప్రజలకు అతి తక్కువ ధరలో ఇసుక సరఫరా చేయడమే ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలోని దుందుభి పరివాహక ప్రాంతంలో ఉన్న ఇసుక ప్రజలకు గతంలో అందకుండా పోయిందని ఇప్పుడు ఈ ప్రాంత ప్రజలకు అతి తక్కువ ధరకే ఇసుకను విక్రయించేందుకు ఈ నెల 8నుంచి మన ఊరు- మన ఇసుక కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ఇష్టమొచ్చినట్లు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని వీటికి త్వరలో చెక్ పెడుతున్నట్లు ఆయన వెల్లడించారు. గృహ అవసరాల కోసం మాత్రమే ఇసుకను వినియోగించాలని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గువ్వల ప్రవర్తన నచ్చక కాంగ్రెస్‌లో చేరిక

బల్మూరు, మార్చి 6 : మండల పరిధిలోని రామాజీపల్లి, అనంతగిరి, కొండనాగుల గ్రామాలకు సంబంధించిన ఎంపీటీసీ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. గువ్వల బాలరాజు ప్రవర్తనతో విసుగు చెందామని అందుకే ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నర్సింగరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంపీపీ

అచ్చంపేటటౌన్, మార్చి 6: అచ్చంపేట ఎంపీపీ శాంతబాయి, రంగాపూర్ మాజీ సర్పంచ్ లోక్యానాయక్ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

హామీలన్నీ అమలు పరుస్తాం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి

కల్వకుర్తి, మార్చి 6 : కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలను వందరోజుల్లో అమలుపరుస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌లో జరిగే పాలమూరు ప్రజాదీవెన సభకు ప్రత్యేక వాహనాల్లో నాయకులు, కార్యకర్తలు బయల్దేరి వెళ్లే వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే నాలుగింటిని అమలుపర్చామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్‌కుమార్, ఐడీసీవైస్ చైర్మన్ బాలాజీసింగ్, నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, భూపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, సైదులుయాదవ్, వెంకటేశ్, సురేష్ తదితరులున్నారు.

భవిష్యత్‌కు మంచి బాట వేసుకోవాలి : డీఈవో

కొల్లాపూర్, మార్చి 6 : విద్యార్థులు ఇష్టపూర్వకంగా చదువుకొని భవిష్యత్‌కు మంచి బాట వేసుకోవాలని డీఈవో గోవిందరాజులు సూచించారు. పట్టణంలోని రాణి ఇందిరాదేవి ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ప్రీఫైనల్ పరీక్షలు రాస్తున్న పదవ తరగతి విద్యార్థుల ప్రశ్నా పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో ఎటువంటి వ్యసనాల బారిన పడకుండా మంచి మార్గంలో పయనించాలన్నారు. అనేక నైపుణ్యాలను నేర్చుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేసి ఉపాధ్యాయుల విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ అధికారి షర్పుద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమ్మానుయేల్, ఉపాధ్యాయులు బ్యాంగి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం : డీఎస్పీ

తిమ్మాజిపేట, మార్చి 6 : గ్రామంలో జరిగిన దొంగతనాలకు సంబంధించి దొంగలను గుర్తించేందుకు వీలుగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని గొరిట గ్రామంలో ఇటీవల జరిగిన వరుస దొంగతనాలలో జరిగిన రెండు ఇండ్లను బుధవారం ఆయన పరిశీలించారు. బాధిత కుటుంబాలకు త్వరగా న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఆయన వెంట సీఐ కనకయ్య గౌడ్, పోలీస్ కానిస్టేబుల్ బాలస్వామి ఉన్నారు.

వైభవంగా ధ్వజస్తంభం, నవగ్రహాల ప్రతిష్ఠ

పెద్దకొత్తపల్లి, మార్చి 6 : మండల పరిధిలోని దేవునితిర్మలాపూర్ గ్రామంలో అంగరంగ వైభవంగా ధ్వజస్తంభం, నవగ్రహాలు, వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. గ్రామంలోని శివాలయం ముందు వేద పండితుల మంత్రోచ్చరణాల మధ్య కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు కే.ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వి.శ్రీనివాసులు, గ్రామ పెద్దలు పుట్ట అంజనేయులు, పుట్ట శివయ్య, బాగి రమేష్, పిల్లి శ్రీనివాసులు, కుమ్మరి తిమ్మయ్య ఏదుల కుర్మయ్య, పి.నాగరాజు, బొలెద్దుల రాజు, పుట్ట బక్కయ్య, పిల్లి శేఖర్, బొల్లె విష్ణు, పి.విజ్ఞయ్య కే.దేవేందర్, కృష్ణంరాజు, శ్రీరాములు, ఎల్లస్వామి, పిల్లి యాదగిరి, కొనమోని దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

కల్వకుర్తి, మార్చి 6 : కల్వకుర్తి పట్టణంలోని లక్ష్మీపద్మావతి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం రాత్రి లక్ష్మీపద్మావతి వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా వేద మంత్రోచ్చరణాల మధ్య జరిగింది. ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ మునిసిపల్ చైర్మన్ రాచోటి శ్రీశైలం, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్‌కు మార్ హాజరయ్యారు. స్వామివారిని దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి

పెద్దకొత్తపల్లి, మార్చి 6 : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం ఉదయం మండల కేంద్ర శివారులో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ కుర్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్ర శివారులోని ఘనపురం చెరువు వద్ద పెద్దకొత్తపల్లి నుంచి కొల్లాపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై గుర్తు తెలియని మహిళ(40)ను బొలెరో వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మహిళ ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని హెచ్‌సీ కోరారు.

ఆర్టీసీ బస్సులోనే తుదిశ్వాస

బిజినేపల్లి, మార్చి 6 : అనారోగ్యంగా ఉన్న కుమారుడు రామకృష్ణ(40)ను తల్లి అనసూయమ్మ ఆర్టీసీ బస్సులో తీసుకొస్తుండగా మృతి చెందాడు. మృతుడి తల్లి అనసూయమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణ మహబూబ్‌నగర్ పట్టణంలోని ఓ వైన్స్‌షాపులో పనిచేస్తూ బిజినేపల్లి నుంచి వెళ్లివచ్చేవాడు. నాలుగైదు రోజులుగా కుమారుడు ఇంటికి రాకపోవడంతో తల్లి మహబూబ్‌నగర్ పట్టణంలో అనారోగ్యంతో, నీరసంగా ఉన్న అతన్ని బుధవారం ఆర్టీసీ బస్సులో బిజినేపల్లికి వెంటబెట్టుకొచ్చింది. బస్టాండ్‌కు రాగానే పడుకొని ఉన్న కుమారుడిని తల్లి తట్టి లేపగా కదలకపోవడంతో బస్సులోనే పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు రామకృష్ణ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడిది వనపర్తి కాగా, జీవనోపాధి కోసం ఐదు నెలలుగా బిజినేపల్లిలో ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నారు.

పట్టపగలు దొంగతనం, కేసు నమోదు

ఊర్కొండ, మార్చి 6 : పట్టపగలు ఇంట్లో దొంగతనం జరిగిన సంఘటన ముచ్చర్లపల్లి గ్రామంలో జరిగింది. ఎస్సై వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దారా కిష్టన్న కుటుంబంతో కలిసి ఇంటికి తాళం వేసి తన సొంత పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు తాళం విరగొట్టి ఇంట్లో ఉన్న బంగారం, వెండి దోచుకెళ్లారు. చోరీకి గురైన సొత్తు విలువ విలువ రూ.80 వేలు ఉంటుందని తెలిపారు. కిష్టన్న బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌తో పెనుభారం

- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్
- ఆర్డీవో కార్యాలయం ముందు బీఆర్‌ఎస్ నిరసన



కొల్లాపూర్‌లో ఆర్డీవో పి.నాగరాజుకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్, మార్చి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎల్‌ఆర్‌ఎస్ పేరుతో ప్రజలపై పెనుభారం మోపేందుకు ప్రయత్నిస్తోందని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు కొల్లాపూర్ ఆర్డీవో కార్యాలయం ముందు ఆ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీరం హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతీ హామీని తుంగలో తొక్కడం పరిపాటిగా మారిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎన్నికల ముందు ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు రెగ్యులరైజేషన్ ఫీజు కట్టేందుకు ముందుకొస్తే ఆనాడు కాంగ్రెస్ పెద్దలు డబ్బులు కట్టవద్దని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఫ్రీగా రెగ్యులరైజేషన్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీని అమలు పర్చాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కొల్లాపూర్ నియోజకవర్గంలో కోట్ల రూపాయల విలువ చేసే పీఎంఆర్ వడ్లను, ప్రభుత్వ సంపదను దోచుకుపోయారని మంత్రి స్వగ్రామంలో ఇంత నిర్వాకం జరిగిన అసలైన దోషులను శిక్షించకుండా కూలీకి వెళ్లిన వారిపై కేసులు నమోదు చేశార న్నారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవో పి.నాగరాజుకు అందజేశారు. కార్యక్ర మంలో జిల్లా కో ఆప్షన్ సభ్యుడు మతిన్‌అహ్మద్, కొల్లాపూర్ ఎంపీపీ రజిత బాస్కర్ గౌడ్, పెంట్లవెల్లి ఎంపీపీ కమలేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు రంగినేని అభిలాష్‌రావు, జీనరేందర్‌రెడ్డి, కాటం జంబులయ్య, రాజేష్, నిరంజన్, సురేందర్‌రావు, కట్ట శ్రీనివాసులు, పోతుల వెంకటేశ్వర్లు, సురేందర్‌గౌడ్, అన్వేష్, డీకే.మాదిగ, ఎంపీటీసీ శంకర్ పాల్గొన్నారు.

కల్వకుర్తిలో ..

కల్వకుర్తి : ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వెల్దండ మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి, పలువురు నియోజకవర్గంలోని ముఖ్య నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారంగా ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్‌రాచోటి శ్రీశైలం, విజయ్ గౌడ్, నాయకులు పాండుగౌడ్, నిరంజన్, సూర్యప్రకాశ్‌రావు, అర్జున్‌రావు, శేఖర్, మల్లేష్, కేశవులు, లింగం, శ్రీనివాస్‌యాదవ్, ఎంపీటీసీలు రవీందర్‌రెడ్డి, శంకర్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులున్నారు.



బీఆర్‌ఎస్ ధర్నాలో పాల్గొన్న కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్, నాయకులు

ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలి

అచ్చంపేటటౌన్: ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు హాని చేసే వైఖరి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. భిన్న ప్రకటనలతో తప్పించుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫ్రీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీరుపై ఇప్పుడే ప్రజలు చర్చించుకుంటున్నారని పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, నాయకులు రాంబాబు, నర్సయ్య రమేష్ రావు, శివశంకర్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి: ఎంపీ



నారీశక్తి వందన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ రాములు

వెల్దండ, మార్చి 6 : దేశంలోని ప్రతీ మహిళ ఆత్మగౌరవంతో బతికి ఆర్థికాభివృద్ధి సాధించడమే ప్రధాని మోదీ సర్కార్ ధ్యేయమని నాగర్‌కర్నూల్ ఎంపీ పి. రాములు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆకృతి గార్డెన్‌లో నియోజకవర్గస్థాయి నారీశక్తి వందన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్చిమబెంగాల్‌లో ప్రధాని మోదీ ప్రసంగాన్ని డిజిటల్ ద్వారా సమావేశానికి హాజరైన మహిళలకు వినిపించారు. అనంతరం రాములు మాట్లాడుతూ ప్రధాని మోదీ చేపడుతున్న పథకాలు, దేశపురోగతి ప్రపంచస్థాయిలో ఉన్నాయన్నారు. మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. ఆచారి మాట్లాడు తూ కేంద్రంలోని బీజేపీ ప్రవేశపెడుతున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యెన్నం శేఖర్‌రెడ్డి, నాయకులు బండెల రాంచంద్రారెడ్డి, రాంపాల్, చక్రవర్తిగౌడ్, నర్సిరెడ్డి, కుర్మిద్దయాదగిరి, పరమేష్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, కృష్ణగౌడ్, దుర్గాప్రసాద్, మోహన్‌రెడ్డి, నర్సింహ, శేఖర్‌రెడ్డి, రాంరెడ్డి, రామస్వామి తదితరులున్నారు.

బీజేపీ పాలనలో రాజ్యాంగం ప్రమాదంలో పడింది



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

అచ్చంపేట, మార్చి 6 : బీజేపీ పాలనలో రాజ్యాంగం ప్రమాదంలో పడిందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ భారతదేశ రాజ్యాంగాన్ని బీజేపీ ప్రభుత్వం మార్చేందుకు ప్రయత్నాలు చేస్తోందని, దీన్ని అడ్డుకోవాల్సిన కాంగ్రెస్ పార్టీ పరోక్షంగా బీజేపీకి వత్తాసు పలుకుతోందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవడం కోసమే బీఎస్పీ బీఆర్‌ఎస్‌తో కలిసి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తోందన్నారు. బహుజనులకు న్యాయం జరిగేది బీఎస్పీ, బీఆర్‌ఎస్‌తోనే అని అన్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో బీఎస్పీ, బీఆర్‌ఎస్ పోటీ చేసే స్థానాలపై త్వరలో విధివిధానాలను, కార్యాచరణను ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ శ్వేత



కొల్లాపూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో కేక్ కట్ చేస్తున్న మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ మహెముదాబేగం

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి6: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ శ్వేత అన్నారు. మహిళ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కమర్ షాజహాన్ సుల్తానా, జిల్లా మహిళా సాధికారత కేంద్రం అధి కారి ఉమాదేవి, వనిత, వేణుగోపాల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి, కళాశాల అధ్యాపకులు, సి బ్బంది పాల్గొన్నారు.

కొల్లాపూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో..

కొల్లాపూర్: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని కొల్లాపూర్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బుధవారం ఘనంగా నిర్వహించారు. డిపో మేనేజర్ ఉమా శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ మహెముదాబేగం పాల్గొని ప్రయాణికులు, ఆర్టీసీ మహిళా సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. ఈ నెల 8న ప్రపంచ మహిళా దినోత్సవం నిర్వహించుకోవాల్సి ఉండగా శివరాత్రి ఉన్నందున ఆర్టీసీ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశానుసారం కార్యక్రమాన్ని బుధవారమే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపోలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ముగ్గురు మహిళా కండక్టర్లను శాలువాలతో సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే ఆరుగురు మహిళా ప్రయాణికులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఎఫ్ యాదయ్య, కార్యాలయ డిప్యూటీ సూపరింటెండెంట్ నజీర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఏడీపీ గౌసొద్దీన్, సేఫ్టీవార్డెన్ నసీమోద్దీన్, ఆర్టీసీ బస్టాండ్ కంట్రోలర్ రాముడు పాల్గొన్నారు.

ధారారం గ్రామంలో..

లింగాల: సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గిరిజా అన్నారు. బుధవారం మండల పరిధిలోని ధారారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జిల్లా మహిళా సాధికారిత కేంద్రం, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ పాఠశాలలో...

కోడేరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ కొల్లాపూర్ ప్రాజెక్టు ఏసీడీపీవో భాగ్యమ్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలు, ఐసీడీఎస్ సిబ్బంది, సూపర్ వైజర్ భాగ్యమ్మ, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కల్వకుర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో..

కల్వకుర్తి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కల్వకుర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ సుభాషిణి కోరారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవా రం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. డీఎం సుభాషిణి, డాక్టర్ యశోదబాయి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళా కండక్టర్లను, మహిళా ప్రయాణికులను సత్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు ధారాసుందర్, ఎల్‌పీ. రెడ్డి, శ్రీధర్, మల్లయ్య, సరళా, జైమేర్సీ, శేషమ్మ, సంతోష, పారిజాత, కల్పన తదితరులున్నారు.



నాగర్‌కర్నూల్‌లో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న కో ఆర్డినేటర్



డాక్టర్ యశోదాబాయిని సన్మానిస్తున్న ఆర్టీసీ డీఎం సుభాషిణి

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు

- డిపో మేనేజర్ ఉమాశంకర్ వెల్లడి

కొల్లాపూర్, మార్చి 6 : ఈ నెల 8న మహాశివరాత్రి సందర్భంగా కొల్లాపూర్ ఆర్టీసీ బస్సు డిపో నుంచి శ్రీశైలం, సోమశిల దేవస్థానాలకు వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఉమాశంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7, 8వ తేదీల్లో రెండు రోజులు శ్రీశైలానికి కొల్లాపూర్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. 8వ తేదీన సోమశిలకు కొల్లాపూర్ నుంచి బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయా ణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

నేటి నుంచి రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

వెల్దండ, మార్చి 6 : దక్షిణకాశీగా పేరుగాంచిన గుండాల అంబారామలింగేశ్వరస్వామి దేవాలయంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నేటి నుంచి ఈనెల 21వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. 7న యాగశాల ప్రవేశం, 8న మహాశివరాత్రి వేడుకలు, అంబారామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం, 11న పూర్ణాహుతి, రుద్రాభిషేకం, 12న పుష్పరథోత్సవం(చిన్నతేరు), 14న పెద్దరథోత్సవం (పెద్దతేరు), 15న వృషభవాహనసేవ, 16న హంసవాహన తెప్పోత్సవం, 17న అంబా పరమేశ్వరి దేవికి అభిషేకం, 20న మంగళహారతి, 21న వడిబియ్యం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన

అచ్చంపేట, మార్చి 6: మండల పరిధిలోని రంగంపేట గ్రామంలో ఉపాధిహామీ పనులను బుధవారం ఎంపీడీవో లక్ష్మణ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు ఎండ తీవ్రత పెరగకముందే ఉదయం వెళ్లి తమకు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు ముగించుకోవాలని సూచించారు. ఉపాధిహామీ కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

అచ్చంపేట, మార్చి 6: మండలపరిధిలోని రాయిచెడు గ్రామంలో బుధవారం 193పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి నరేందర్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది బాలకోటి, కమల, వెంకటేశ్వర్లు చెన్నయ్య తదితరులున్నారు.

తిమ్మాజిపేట ఎస్‌ఐగా పి.నరేందర్‌రెడ్డి

తిమ్మాజిపేట, మార్చి 6 : తిమ్మాజిపేట ఎస్‌ఐగా పి.నరేందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్‌ఐగా పని చేసిన భాస్కర్‌రెడ్డి మహబూబ్‌నగర్‌కు బదిలీ కాగా ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి నాగర్‌కర్నూల్ నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలు కాపాడడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

తాడూరు, మార్చి 6 : మండలంలోని మేడిపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సంబంధించి గురువారం ఉదయం 11గంటల నుంచి విద్యుత్ అంతరాయం కలుగుతుం దని విద్యుత్ శాఖ మండల అధికారి శ్రీరాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం మేడిపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఐదు ఎంవీ అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన మరమ్మతులు కొనసాగుతున్న నేపథ్యంలో ఆకునెల్లికుదురు, నాగదేవపల్లి, పొల్మూరు, గుట్టలపల్లి గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉండనున్నట్లు తెలిపారు.

'ఎస్‌వోను సస్పెండ్ చేయాలి'

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి6: మెనూను పాటించకుండా నాసిరకం భోజనం అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న నాగనూలు కేజీబీవీ ప్రత్యేక అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కందికొండ గీత, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా తారాసింగ్ డిమాండ్ చేశారు. బుధవారం ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ బృందం నాగనూలు కేజీబీవీ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాసిరకమైన కూరగాలు, పురుగుల అన్నం పెడుతుడడంతో పాఠశాలలో దాదాపు 20 మంది విద్యార్థులు అనారోగ్యానికి గురై ఇంటికి వెళ్లారని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులు తాగడానికి మంచినీరు అందుబాటులో లేవన్నారు. నాగనూలు కేజీబీవీలో నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారులు విచారణ జరిపించి ప్రత్యేక అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు లక్ష్మణ్, ఐద్వా నాయకులు ఈశ్వరి, నవనీత పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ మండల కార్యవర్గం ఎన్నిక

మన్ననూర్, మార్చి 6: ఉమ్మడి అమ్రాబాద్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని మన్ననూరులో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా కొండయ్య కో కన్వీనర్‌లుగా సైదులు, ఎడ్మ శ్రీను, బాలస్వామి, కర్నాటి శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ మన్ననూరు అటవీశాఖ అతిథి కార్యాలయంలో డీఎఫ్‌వో రోహిత్ గోపిడిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి మండలాల పాత్రికేయులు అంజయ్య, ప్రకాశ్, నీల శ్రీనివాసులు, వేదాంతం, ఎల్లస్వామి, రామస్వామి పాల్గొన్నారు.

పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాల వితరణ

అచ్చంపేట, మార్చి6: శ్రీశైలం ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వరక్షేత్రంలో శివపార్వతీల పంచలోహ ఉత్సవ విగ్రహాలను మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి తనయుడు నాగం శశిధర్ రెడ్డి బుధవారం ఈవో శ్రీనివాస్ రావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో అర్చకులు వీరయ్య, నీలకంఠం, రాజశేఖర్, రవికుమార్ పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

తెలకపల్లి, మార్చి 6 : మండల పరిధిలోని వట్టిప ల్లితండా, వట్టిపల్లి, జంగమోనిపల్లి గ్రామాల్లో బుధవారం ఆర్డీవో సురేష్ పర్యటించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. ఆయన వెంట తహసీల్దార్ పాండునాయక్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నడ్డిరోడ్డుపై పసికందు

- అక్కున చేర్చుకున్న ఐసీడీఎస్ సీడీపీవో

అచ్చంపేట ,మార్చి 6: నెలలు కూడా నిండని పసికందును నడ్డిరోడ్డుపై వదిలివెళ్లారు. ఈ ఘటన మంగళవారం రాత్రి పట్టణంలోని పోస్టాఫీసు సమీపంలో చోటు చేసుకున్నది. స్థానిక చిరువ్యాపారులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగాల మండలం మండలం ఎర్రపెంటకు చెందిన ఓ గిరిజన మహిళ తన నెలల పసికందును వదిలి వెళ్లిపోయింది. చిరువ్యాపారులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీడీపీవో దమయంతి, సిబ్బంది శిశువును స్థానిక బాలసదన్ తరలించారు. శిశువు కుటుంబ సభ్యులను విచారించి పాలమూరులోని చైల్డ్ హోమ్ కేర్‌కు అప్పగి స్తామని ఆమె తెలిపారు.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

అచ్చంపేటటౌన్, మార్చి 6 : ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన అచ్చంపేట పట్టణంలో రాంనగర్ కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన గడిగే యాదమ్మ (40) అప్పుల బాధతో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. చుట్టుప్రక్కల వారు గమనించి స్థానిక ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి భర్త కిష్టయ్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతురాలి అన్న లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అచ్చంపేట ప్రభుత్వం ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.